క్లుప్తంగా

వెంకన్న సన్నిధిలో నేడు పూజలు

కాకినాడ సిటీ: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు స్థానిక వెంకట్‌నగర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పార్టీ కాకినాడ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న శుక్రవారం సాయంత్రం తెలిపారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తప్పక పాల్గొనాలని కోరారు.

డ్వాక్రా ఉత్పత్తులను ప్రోత్సహించండి

మెప్మా పీడీ ప్రియంవద



డ్వాక్రా ఉత్పత్తులను పరిశీలిస్తున్న మెప్మా పీడీ ప్రియంవద

కాకినాడ: స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలకు సంబంధించిన మెప్మా అర్బన్ మార్కెట్‌ను కాకినాడ నగరంలో శుక్రవారం ప్రారంభించారు. రిజర్వ్ పోలీసు లైన్ సమీపంలోని ఓల్డ్ మీ సేవా కేంద్రంలో ఈ ప్రదర్శన ఏర్పాటు చేశారు. నగరంలోని పలు మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన పలు ఉత్పత్తులను ప్రదర్శనలో ఉంచారు. ఈ ప్రదర్శనను మెప్మా పీడీ ప్రియంవద ప్రారంభించారు. కాకినాడ నగర పాలక సంస్థ, మెప్మా విభాగం సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ టీపీఆర్వో శైలజ, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ డి.వెంకట్రాజు, సూపరింటెండెంట్ సతీష్, సీఓలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ ప్రదర్శనలో పలు ఉత్పత్తులను ఉంచారు. నగర ప్రజలు ఈ అర్బన్ మార్కెట్‌ను సందర్శించి మహిళా స్వయం సహాయక సంఘాలను ప్రోత్సహించాలని పీడీ ప్రియంవద కోరారు.

ఘనంగా భగత్ సింగ్ జయంతి



భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సభ్యులు

కాకినాడ రూరల్: అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక రమణయ్యపేటలో భగత్‌సింగ్ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షుడు అడబాల రత్నప్రసాద్ మాట్లాడుతూ, భరతమాత దాస్య శృంఖలాలను తొలగించడానికి తన ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన మహోన్నత దేశభక్తుడు భగత్‌సింగ్ అని కొనియాడారు. 1907 సెప్టెంబర్ 27న పంజాబ్ రాష్ట్రంలోని సొందా గ్రామంలో ఆయన జన్మించారన్నారు .28 ఏళ్లకే ఉరికంబం ఎక్కిన ధీశాలి అని నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు రాజా, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దాత ఆశయాల మేరకు సేవలు



ఈఓగా బాధ్యతలు స్వీకరిస్తున్న విజయ భాస్కర్‌రెడ్డి

బోట్‌క్లబ్: మహోన్నతమైన దాత ఆశయాలకు అనుగుణంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తానని బంగారు చిన శోభనాద్రి సత్రం ఈఓ చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. స్థానిక పెద్ద మార్కెట్‌లో ఉన్న బంగారు చిన శోభనాద్రి సత్రం ఈఓగా శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి కాకినాడకు చదువుకోవడానికి వస్తున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు అన్ని విధాలా కృషి చేస్తానన్నారు. రోగులకు హోమియో వైద్య సేవలు మరింతగా విస్తృతం చేస్తామన్నారు.

సబ్ రిజిస్ట్రార్ల బాధ్యతల స్వీకరణ



ఆర్‌వీ రామారావు



పీఎస్‌వీఎస్ఎస్ వీరభద్రరావు

కాకినాడ లీగల్: కాకినాడ సబ్ రిజిస్ట్రార్-1గా ఆర్‌వీ రామారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కడియం సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తూ బదిలీల్లో భాగంగా కాకినాడ సబ్ రిజిస్ట్రార్-1గా నియమితులయ్యారు. గతంలో కాకినాడ , తుని సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేశారు.

సబ్ రిజిస్ట్రార్-2గా వీరభద్రరావు

కాకినాడ సబ్ రిజిస్ట్రార్-2గా పీఎస్‌వీఎస్ఎస్ వీరభద్రరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రాజానగరం సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తూ బదిలీల్లో భాగంగా కాకినాడ సబ్ రిజిస్ట్రార్-2గా నియమితులయ్యారు. గతంలో కాకినాడ సీనియర్ అసిస్టెంట్‌తో పాటు, ఆలమూరు, తాళ్లరేవు సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహించారు.

అక్కడ చిరుత.. ఇక్కడ గ్రామసింహాలు

- పెరుగుతున్న కుక్కకాటు బాధితులు
- భయాందోళనలో గ్రామీణ, పట్టణ ప్రజలు
- నియంత్రణపై అధికారుల్లో కానరాని చిత్తశుద్ధి



రోడ్డుపై గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

కాకినాడ సిటీ: తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం పరిసరాల్లో చిరుత పులి జనాలను భయపెడుతుంటే, సాగర తీరంలో ఉన్న కాకినాడ నగరం, రూరల్ ప్రాంతాల్లో గ్రామ సింహాలు ప్రజానీకానికి హర్రర్ సినిమా చూపెట్టి 'టెర్రర్' సృష్టిస్తున్నాయి. మొరిగే కుక్కలు కరవవని అంటారు. అది ఒకప్పుడు. ఇప్పుడు కుక్కలు మొరిగినా.. మొరగక పోయినా.. పెద్దగా నోరు తెరిచి, మీద పడి.. పిక్కలు పీకేస్తున్నాయి. రేయింబవళ్లు తేడా లేకుండా, చిన్నా పెద్దా అందరిపైనా దాడి చేస్తున్నాయి. రోజురోజుకూ కుక్కల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఒక్కో గ్రామంలో రెండొందల నుంచి మూడొందల వరకూ విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. కాకినాడ సిటీ, రూరల్ నియోజకవర్గాల్లో దాదాపు 14 వేల వీధి కుక్కలుంటాయని అంచనా.

గ్రామ సింహాల బారిన పడి నిత్యం ఇద్దరు లేదా ముగ్గురు ఆస్పత్రుల పాలవుతున్నారు. గడచిన ఆరు నెలల్లో కాకినాడ రూరల్, సిటీ నియోజకవర్గాల్లో 798 మంది కుక్కకాటుకు గురయ్యారు. కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాల్సిన అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజలు ఫిర్యాదు చేస్తే ఎండార్స్‌మెంట్‌లతో సరిపెట్టి చేతులు దులుపుకొంటున్నారు. కాకినాడ నగరంలోని సాంబమూర్తినగర్, సంజయ్‌నగర్, గొడారిగుంట, గాంధీనగర్, పర్లోవపేట, ఏటిమొగ, జగన్నాథపురం, తూరంగి, రమణయ్యపేట, వలసపాకల, వాకలపూడి, చీడిగ, ఇంద్రపాలెం, కొవ్వాడ, కొవ్వూరు, రేపూరు, గంగనాపల్లి తదితర గ్రామాల్లోనూ, వీధి కుక్కల సంఖ్య పెరగడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వీధుల్లో కుక్కలు గుంపులుగా తిరుగుతూ ప్రజలపై దాడికి చేస్తున్నాయి. పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం ఉండడం లేదని పలు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రహదార్లపై ప్రమాదకరంగా..

రహదారుల పక్కన గుంపులుగా ఉన్న కుక్కలు ఒక్కసారిగా రోడ్డుపైకి రావడంతో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. జగన్నాథపురం, ఘాటీ, సాంబమూర్తినగర్, సంజయ్‌నగర్, గొడారిగుంట, కాకినాడ-యానాం, నడకుదురు, తూరంగి, ఇంద్రపాలెం, కరప, వేళంగి, తిమ్మాపురం, సర్పవరం ప్రధాన రహదారిలో ద్విచక్ర వాహనదారుల పరిస్థితి మరింత అపాయకరంగా మారింది. నహదారిపై ప్రయాణిస్తున్న వాహన చోదకులపై గ్రామ సింహాలు వెంటపడి తరుముతున్నాయి. దీంతో వారు ప్రమాదాల బారినపడి, గాయాలతో ఆస్పత్రుల పాలైన సంఘటనలున్నాయి. గ్రామాల్లో ఎక్కడైనా కుక్కకాటుకు గురైన వారు అధికారులను నిలదీస్తే, కనీస స్పందన కనిపించడం లేదు. కొత్తవారు గ్రామాలు, వార్డుల్లోకి అడుగుపెట్టాలంటే భయాందోళన చెందుతున్నారు. కొన్ని గ్రామాల్లో చీకటిపడితే శునకాల భయంతో ప్రజలు వీధుల్లోకి రావడానికి జంకుతున్నారు.

పిల్లల పరిస్థితి దయనీయం

గ్రామాల్లో, నగరంలోని డివిజన్లలో వీధి కుక్కలు గుంపులుగా సంచరిస్తూ దాడులు చేస్తున్నా, వాటి నియంత్రణకు అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్న ఆవేదన ప్రజల్లో కనిపిస్తోంది. కుక్కల దాడులతో ఆస్పత్రి పాలవుతున్నామని బాధితులు వాపోతున్నారు. వాహనాలపై వెళుతున్నా దాడి చేస్తున్నాయని, ఇళ్లల్లోకి సైతం చొరబడుతున్నాయని చెబుతున్నారు. కుక్కల నుంచి పెద్దలు కాస్త తప్పించుకోగలుగుతున్నా, చిన్నారుల పరిస్థితి దయనీయంగా ఉంటోంది. పెద్దల పిక్కలు పట్టుకునే కుక్కలు, పిల్లల ముఖం, మెడ, చెవి, వీపు భాగాల్లో దాడి చేస్తున్నాయి.

అప్రమత్తతే జనానికి రక్ష

- కుక్కల బారిన పడకుండా ఉండాలంటే జనాలు అప్రమత్తంగా ఉండక తప్పదు. ఇందుకు కొన్ని జాగ్రత్తలను పాటించాలి.
- మాంసం దుకాణాలు, హోటళ్ల వద్ద ఆహార వ్యర్థాలను సక్రమంగా నిర్వహించాలి.
- పెంపుడు కుక్కలకు రేబిస్ సోకకుండా ఏడాదికోసారి విధిగా టీకాలు ఇప్పించాలి.
- వీధి కుక్కలకు కూడా పురపాలక, గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో టీకాలు వేసే కార్యక్రమాలు నిర్వహించాలి.
- అన్ని వీధుల్లో శునకాలు స్వైర విహారం చేస్తున్నందున పిల్లలను ఒంటరిగా బయటకు పంపరాదు.
- కుక్కల కుటుంబ నియంత్రణకు స్వచ్ఛంద సంస్థలు, పశు సంవర్ధక శాఖ సమన్వయంతో పనిచేయాలి.
- కుక్కకాటుకు గురైనప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చికిత్స విధానంపై అవగాహన పెంచుకోవాలి.

బయటకు రావాలంటే భయమేస్తోంది



మండలంలోని అనేక గ్రామాల్లోను, కాకినాడ నగరంలోను కుక్కల బెడద చాలా ఎక్కువగా ఉంది. గ్రామాల్లో కనీసం 200 నుంచి 300 వరకు కుక్కలు నిత్యం స్వైరవిహారం చేస్తూ, ప్రజలను గాయపరుస్తున్నాయి. ఇంటి నుంచి బయటకు రావాలంటే భయమేస్తోంది. చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు రోడ్డు వెంట నడుస్తుంటే వెంటపడి కరుస్తున్నాయి. అధికారులకు చెబుతున్నా పట్టించుకోవడం లేదు. కుక్కలు పట్టించేందుకు అధిక ఖర్చులు చూపిస్తూ, కోర్టు కేసులంటూ తప్పించుకుంటున్నారు.

– బొమ్మిడి శ్రీనివాస్, పగడాలపేట, తూరంగి

నియంత్రణకు చర్యలు చేపడతాం



నగరంలో కుక్కల బెడదపై ఫిర్యాదులు వస్తున్నాయి. వీధుల్లో ఎక్కువగా కుక్కలు ఉంటున్నాయి. వీటికి స్టెరిలైజేషన్ చేయిస్తున్నాం. కుక్కలను వార్డుల వారీ పట్టుకెళ్లి, స్టెరిలైజేషన్ చేసి తిరిగి విడిచి పెడుతున్నాం. కుక్కలను పట్టి సుదూర ప్రాంతాలకు తరలించేందుకు అధికారులతో చర్చించి, కార్యాచరణ చేపడతాం.

– డాక్టర్ పృథ్వీచరణ్, ఎంహెచ్‌వో, కాకినాడ

'ఎకో ఫ్రెండ్లీ..' విజేతలకు బహుమతీ ప్రదానం



తలాటం హరీష్‌ను సత్కరిస్తున్న గ్రంధి బాబ్జి

బోట్‌క్లబ్: నగరాన్ని కాలుష్య రహితంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్న మన ఊరు ఫౌండేషన్ సేవలు అభినందనీయమని బాలాత్రిపుర సుందరి అమ్మవారి ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ గ్రంధి బాబ్జి అన్నారు. స్థానిక నాగమల్లితోట వద్ద నున్న మన ఊరు ఫౌండేషన్ కార్యాలయంలో శుక్రవారం ఎకో ఫ్రెండ్లీ వినాయక కాంటెస్ట్ విజేతల బహుమతి ప్రదానోత్సవం జరిగింది. కార్యక్రమానికి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు విద్యాసాగర్ అధ్యక్షత వహించగా, రోటరీ క్లబ్ మాజీ గవర్నర్ వీరభద్రారెడ్డి విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. తొలుత ఫౌండేషన్ తరపున నిర్వహించిన ఎకో ఫ్రెండ్లీ గణపతి కాంటెస్ట్ విజేతల వివరాలను విద్యాసాగర్ ప్రకటించారు. హరీష్ స్పోర్ట్స్ వద్ద ఏర్పాటు చేసిన 7 అడుగుల మట్టి విగ్రహం మొదటి బహుమతి సాధించగా, ఇంద్రపాలెంలో గీసాల శ్రీను ఏర్పాటు చేసిన 4 అడుగుల మట్టి విగ్రహం రెండో బహుమతి గెలుచుకున్నాయి. ఈ సందర్భంగా అతిథులు గ్రంధి బాబ్జి, వీరభద్రారెడ్డి కలిసి తలాటం హరీష్, గీసాల శ్రీనును సత్కరించి, జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో జేఎన్‌టీయూకే ఎంబీఏ డైరెక్టర్ కృష్ణమోహన్, ప్రొఫెసర్ అలపాటి శ్రీనివాస్, రిటైర్డ్ ప్రొఫెసర్ అబ్బాయి, జీకే శ్రీనివాస్, సూర్య, అనుపమ, శేఖర్ పాల్గొన్నారు.

ఖైదీలు సత్ప్రవర్తన కలిగి ఉండాలి



సబ్ జైలును పరిశీలిస్తున్న న్యాయమూర్తి లీలాశ్యామ్ సుందరి

కాకినాడ లీగల్: ఎల్లప్పుడూ ఖైదీలు సత్ప్రవర్తన కలిగి ఉండాలని, అనవసర గొడవల్లో వెళ్లడం వలన కుటుంబంతో పాటు, సమాజంలో ఇబ్బందులు ఎదుర్కొంటారని కాకినాడ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వి.లీలాశ్యామ్ సుందరి అన్నారు. శుక్రవారం స్థానిక స్పెషల్ సబ్ జైలును న్యాయమూర్తి పరిశీలించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి లీలా శ్యామ్ సుందరి మాట్లాడుతూ, ఎవరికైనా న్యాయవాదులను పెట్టుకునే స్తోమత లేకపోతే తమ సంస్థకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అనేక చట్టాలపై అవగాహన కల్పించారు. నాణ్యమైన భోజనం పెడుతున్నారా అని న్యాయమూర్తి ఆరా తీశారు. అలాగే వంటశాల పరిశుభ్రతను పరిశీలించారు. ఆమె వెంట సబ్ జైలు సూపరింటెండెంట్ ఎం.వీరబాబు, సిబ్బంది ఉన్నారు.

కోర్టులో పార్కింగ్ కోసం స్థల పరిశీలన

కాకినాడ లీగల్: కాకినాడ కోర్టు ఆవరణలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, కక్షిదారులకు చెందిన వాహనాలను ఎక్కడ పార్కింగ్ చేయాలనే విషయమై కాకినాడ మూడో అదనపు జిల్లా జడ్జి పి.కమలాదేవితో పాటు, న్యాయమూర్తులు శుక్రవారం పరిశీలించారు. వీరితో పాటు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ముత్తింటి విశ్వేశ్వరరావు, సభ్యులు పార్కింగ్ స్థల పరిశీలన చేశారు. ఇటీవల మూడో అదనపు జిల్లా జడ్జి కోర్టు నూతన భవనం ప్రారంభమయ్యాక, కోర్టు ఆవరణలో అడ్డదిడ్డంగా వాహనాలు, కార్లు పార్కింగ్ చేయడంతో న్యాయవాదులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించడానికి శుక్రవారం కోర్టు ఆవరణను న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ సభ్యులు పరిశీలించారు.

పిల్లల భవిష్యత్తుకు బంగారు బాట

కాకినాడ సిటీ: పిల్లల భవిష్యత్తును ప్రభుత్వం బంగారుమయం చేయనుందని కాకినాడ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం సాయంత్రం నగరంలోని 41, 43, 44, 45, 46 డివిజన్లకు సంబంధించి ఇది మంచి ప్రభుత్వం ప్రజా వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషన్ మనోహర్, నగరపాలక సంస్థ కార్యదర్శి ఏసుబాబు, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీచరణ్, టీపీఆర్వో శైలజ, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ డి వెంకట్రాజు, ఇంజినీరింగ్, రెవెన్యూ అధికారులు, సచివాలయాల సిబ్బంది, యానిమేటర్లు పాల్గొన్నారు.

చెత్త సేకరణలో నిర్లక్ష్యం వద్దు



చెత్త సేకరణపై సూచనలిస్తున్న కమిషనర్ భావన

కాకినాడ: ఇంటింటా చెత్త సేకరణలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని ఉపేక్షించేది లేదని నగరపాలక సంస్థ కమిషనర్ భావన స్పష్టం చేశారు. అలాగే ప్రజలు కూడా తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందజేసి కాకినాడ నగరం స్వచ్ఛంగా ఉండేందుకు సహకరించాలని ఆమె కోరారు. శుక్రవారం కాకినాడ నగరంలోని 42వ డివిజన్ రవిచంద్ర హాస్పిటల్ పరిసర ప్రాంతం, 41వ డివిజన్‌లోని గాంధీనగర్ చాగంటి వారి వీధిలో పారిశుధ్య నిర్వహణను కమిషనర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఇంటింటికీ చెత్త సేకరణ ఎలా జరుగుతున్నదీ పరిశీలించారు. చెత్త సేకరణ సక్రమంగా నిర్వహించాలని ఈ సందర్భంగా సిబ్బందికి సూచించారు. లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. స్థానికులతోనూ కమిషనర్ మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్య నిర్వహణకు సహకరించాలని కోరారు. ఆమె వెంట శానిటరీ సూపర్‌వైజర్ రాంబాబు, పారిశుధ్య సిబ్బంది ఉన్నారు.

కోకనాడ చాంబర్ చైర్మన్‌గా బాబు



సమావేశమైన ది కోకనాడ చాంబర్ కామర్స్ ప్రతినిధులు

కాకినాడ: ది కోకనాడ చాంబర్ కామర్స్ అధ్యక్షుడిగా వీవీ రాఘవులు (బాబు) ఎన్నికయ్యారు. కోకనాడ చాంబర్ కార్యాలయంలో 2024–25 సంవత్సరానికి సంబంధించి కార్యవర్గ ఎన్నిక జరిగింది. కార్యవర్గ వివరాలను శుక్రవారం ఇక్కడ విడుదల చేశారు. ఈ ఎన్నికలో బాబు ఐదోసారి తిరిగి చైర్మన్‌గా ఎన్నికయ్యారు. మరో 8 మంది సభ్యులను కూడా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా బాబు, సభ్యులుగా ఏకే విశ్వనాథం , ఏవీ రంగారావు, గాదం మహేష్, పివి రావు, దంటు భాస్కర్, ఎమ్మెస్ కుమార్, శ్రీరాం భగవతి, సి.నరసింహారావు ఎన్నికయ్యారు. అంతకుముందు 2023–24 వార్షిక సంవత్సరానికి సంబంధించి జమ, ఖర్చులు ఆడిట్ వివరాలు సమావేశంలో ప్రవేశపెట్టగా, ఆమోదించారు. అలాగే కాకినాడ పోర్టులో జరిగే ఎగుమతి, దిగుమతులపై సభ్యులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ బాబు మాట్లాడుతూ, సుదీర్ఘ చరిత్ర కలిగిన కాకినాడ పోర్టు ప్రతిష్టను కాపాడేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. అనంతరం బాబుకు పలువురు అభినందనలు తెలిపారు.

పర్యాటక రంగంతో సమగ్రాభివృద్ధి



కార్యక్రమంలో మాట్లాడుతున్న కృష్ణమోహన్

కాకినాడ రూరల్: విహారం నేడు ఓ పరిశ్రమగా రూపుదిద్దుకుని, ఆదాయ వనరుగా అభివృద్ధి చెందిందని ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధి జి.కృష్ణమోహన్ అన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సామాజిక, సాంస్కృతిక, రాజకీయ, ఆర్థిక విలువలపై అవగాహన పెంచడం ఈ దినోత్సవ లక్ష్యమన్నారు. 1980 నుంచి ఏటా సెప్టెంబర్ 27న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని జరుపుతున్నామన్నారు. కొత్త ప్రదేశాలను సందర్శించడం వలన జీవనోత్సాహం కలుగుతుందన్నారు. దీంతో ఓర్పు, విజ్ఞానం, సానుకూల దక్పథం అలవడుతాయని వివరించారు. సాంకేతికతను అలవర్చుకున్న ఆధునిక కాలంలో రకరకాల ప్రయోజనాల కోసం అధికంగా విహారయాత్రలు చేస్తున్నారన్నారు. కొన్ని దేశాలకు పర్యాటక ప్రదేశాలే ప్రధాన ఆదాయ మార్గమన్నారు. వాస్తవంగా మన దేశంలోనే వారసత్వ సంపద అధికమని చెప్పారు. పర్యాటకుల్లో మన దేశస్థులే ఎక్కువని, విదేశీ పర్యాటకులు తక్కువన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు అడబాల రత్నప్రసాద్, రేలంగి బాపిరాజు, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ కోర్టు ఏపీపీగా రాధిక బాధ్యతల స్వీకరణ



కాకినాడ లీగల్: కాకినాడ స్పెషల్ ప్రొహిబిషన్ ఎక్సైజ్, జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ఏపీపీగా ఎస్ఎస్ రాధిక శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె ముమ్మిడివరం జేఎఫ్‌సీఎం కోర్టులో ఏపీపీగా విధులు నిర్వహిస్తూ, ఇటీవల బదిలీల్లో భాగంలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ కోర్టుకు నియమితులయ్యారు.. గతంలో కాకినాడ స్పెషల్ మొబైల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో ఏపీపీగా విధులు నిర్వహించారు.

ఆచారాలను గౌరవించే వారిని అడ్డగించడం తగదు

ఆధ్యాత్మిక వేత్త దూసర్లపూడి



బోట్‌క్లబ్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరుమల వేంకటేశ్వర స్వామి వారి దర్శనానికి వెళ్లకుండా అడ్డుకుంటున్న పోకడలు తగవని భోగిగణపతి పీఠం ఉపాసకులు దూసర్లపూడి రమణరాజు శుక్రవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. మతాల మధ్య అగాధాలు నెలకొల్పడం వలన సర్వ సమానత్వం మంట గలుస్తుందన్నారు. రాజ్యాంగం ఇందుకు అంగీకరించదన్నారు. మత సంప్రదాయాలను గౌరవించే ప్రతి ఒక్కరికీ దేశంలో గుడి, మసీదు, చర్చిలకు వెళ్లే హక్కు ఉందన్నారు. తిరుపతికి ముఖ్యమంత్రి హోదాలో దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి, ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలుమార్లు స్వామివారిని దర్శించుకున్నారని గుర్తుచేశారు. సుప్రీం కోర్టు జడ్జి, రాష్ట్రపతి, ప్రధానితో వెళ్లినప్పుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అడ్డుతగలని డిక్లరేషన్ మాజీ సీఎం అయ్యాక ఎందుకని ప్రశ్నించారు. కుట్రపూరిత కల్తీ లడ్డూ ఎపిసోడ్‌తో అగాధాలు సృష్టించడంపై ప్రజల్లో అసహనం ఉందన్నారు. స్వామి వారి దర్శనం విషయంలో ఏర్పడిన ప్రతిష్టంభనపై సుప్రీం కోర్టు సుమోటోగా పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంపై ఇకనైనా దృష్టి సారించాలని అధికార పార్టీ నాయకులకు హితవుపలికారు. రాష్ట్రంలో అనేక సమస్యలు ప్రజలను పట్టి పీడిస్తున్నాయన్నారు. లడ్డూ వ్యవహారంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రమేయం లేని స్వతంత్ర ప్రతిపత్తి దర్యాప్తు సంస్థలతో నిర్ధారణ చేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రాజకీయ రగడగా తిరుమల శ్రీవారిని కేంద్రీకృతం చేయడం అమంగళకరమన్నారు.

జాబ్‌మేళాలో 144 మంది ఎంపిక



జాబ్‌మేళాలో ఎంపికైన అభ్యర్థులు

కాకినాడ సిటీ: వికాస ఆధ్వర్యంలో శుక్రవారం కాకినాడ ఏఎస్‌డీ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ఫర్ ఉమెన్స్‌లో నిర్వహించిన జాబ్ మేళాకు 306 మంది అభ్యర్థులు హాజరైనట్లు వికాస పీడీ కె.లచ్చారావు తెలిపారు. సోనాసోనిక్, ఐసాన్ ఎక్స్‌పీరియన్స్, ఇసూజ్ మోటార్స్ లిమిటెడ్, హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్‌తో పాటు, ప్రముఖ కంపెనీల్లో 144 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. జిల్లా ప్రొఫెషనల్ వింగ్ అధ్యక్షుడు వనమాడి మోహన్‌వర్మ మాట్లాడుతూ, అభ్యర్థులు ఈ ఉద్యోగావకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి నెలా జాబ్ మేళాను ఏఎస్‌డీ కళాశాలలో నిర్వహిస్తామని ప్రాజెక్టు డైరెక్టర్ లచ్చారావు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ వి.అనంతలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ సువత్సల తదితరులు పాల్గొన్నారు.

• సుందర 'స్వచ్ఛత'



జగన్నాథపురంలోని ఎన్టీఆర్ బ్రిడ్జిపై పెయింటింగ్ వేస్తున్న పెయింటర్లు

కాకినాడ: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల్లో భాగంగా కాకినాడ నగర సుందరీకరణ దిశగా నగరపాలక సంస్థ యంత్రాంగం దృష్టి సారించింది. ఈ నెల 17వ తేదీ నుంచి ప్రారంభమైన స్వచ్ఛతా కార్యక్రమాలు అక్టోబర్ రెండో తేదీన ముగియనున్నాయి. ఈ నేపథ్యంలో సంపూర్ణ స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా స్థానిక జగన్నాథపురంలోని ఎన్టీఆర్ బ్రిడ్జిని అందంగా, రంగులతో తీర్చిదిద్దుతున్నారు.

వర్షంతో తప్పని అవస్థలు



అపోలో ఆస్పత్రి సమీపంలో వర్షపు నీటిలో వాహనదారుడి ఇబ్బందులు



పెద్ద మార్కెట్‌లో నీట మునిగిన కూరగాయల షాపులు

బోట్‌క్లబ్: కాకినాడ నగరాన్ని శుక్రవారం వర్షం ముంచెత్తింది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ పలు దఫాలుగా కురిసిన వర్షానికి నగరంలో ఏ వీధి చూసినా మోకాలి లోతు నీరు నిలిచి ఉండడంతో ప్రజలు పడరాని పాట్లు పడ్డారు. డ్రైనేజీల్లో పూడికలు పేరుకుపోవడంతో వర్షపు నీరు పోయే దారిలేక రహదారులపై చేరింది. దీంతో మెయిన్ రోడ్డు, టూ టౌన్ నూకాలమ్మ గుడి వీధి, సినిమా సెంటర్, రామారావుపేట, విద్యుత్‌నగర్, ఎల్‌బీ నగర్ , రామకృష్ణారావుపేట, రేచర్లపేట, కొత్తపేట మార్కెట్‌తో పాటు, పలు ప్రాంతాల్లో ప్రజలు ముంపులో సాహసం చేయాల్సి వచ్చింది. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు స్పందించి, డ్రైనేజీల్లో పూడికలు తీయించాలని ప్రజలు కోరుతున్నారు.

విశ్రాంత ఉద్యోగుల వితరణ

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): విజయవాడ వరద బాధితుల కోసం కాకినాడకు చెందిన ఏపీ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ విశ్రాంత జనరల్ మేనేజర్ ప్రసాద్ నాయుడు ఆధ్వర్యంలో రూ.1.30 లక్షల ఆర్థిక సాయాన్ని సీఎం రిలీఫ్ ఫండ్‌కు అందజేశారు. సంస్థ విశ్రాంత ఉద్యోగులు, తన సన్నిహితుల నుంచి ఆయన విరాళాలు సేకరించారు. ఈ మొత్తాన్ని డీడీ రూపంలో వ్యవసాయ శాఖ మంత్రి కింజరపు అచ్చెంనాయుడుకు శుక్రవారం ఆయన స్వగ్రామం నిమ్మడలో అందజేశారు.